క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయండి

చాపాడు : మండల పరిధిలోని ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో నెల 26, 27వ తేదీల్లో నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు జయప్రదం చేయాలని ఆలయ ఈఓ శ్రీనివాసులు కోరారు. గురువారం మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ఈఓ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు నారాయణ, ఆలయ పండితులు నరేంద్ర శర్మ ఆవిష్కరించారు. ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొని వీరభద్రస్వామి ఆశీస్సులు అందుకోవాలని ఈఓ కోరారు.

ఆర్‌ఎస్‌కేలకు చేరిన 20 టన్నుల యూరియా

అట్లూరు : రైతు సేవాకేంద్రాలకు 20 టన్నుల యూరియా గురువారం చేరినట్లు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య తెలిపారు. రైతులకు నువ్వుల పైరుకు, వరి, జొన్న తదిర సాగులో ఉన్న పైర్లకు యూరియా అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కొండూరు, కమలకూరు రైతు సేవా కేంద్రాలకు 10 టన్నుల చొప్పున 20 టన్నులు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

పట్టుదలతో లక్ష్యం సాధించవచ్చు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యం సాధించవచ్చునని వేదవ్యాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని వాసవీ కల్యాణ మండపంలో వేద వ్యాస డిగ్రీ కాలేజీ డే వేడుక గురువారం నిర్వహించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ డిగ్రీ తర్వాత సాఫ్ట్‌వేర్ రంగంతోపాటు ఐఏఎస్, ఐపీఎస్, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో రాణించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. కళాశాల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్య అభ్యసించి విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో సుబ్బయ్య, కోదండపాణి, మాదాసు మురళి, నాగరాజు, యాసిన్, రామలక్ష్మిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓకు వినతి

ప్రొద్దుటూరు కల్చరల్ : మౌలిక వసతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు రమేష్, జగదీష్, జయరాజ్, బయన్న డిమాండ్ చేశారు. గురువారం డిప్యూటీ డీఈఓ మీనాక్షిని కలిసి వినతి పత్రం అందించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈఓ పరిధిలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు రెన్యువల్ లేకపోయినప్పటికీ 2025–26 విద్యాసంవత్సరానికి అక్రమ అడ్మిషన్లు చేస్తూ ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. విద్యా సంస్థలను అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కంటి అద్దాల పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎంఈఓ–2 శోభారాణి, ఆప్తాలమిక్ ఆఫీసర్ కేజే.రఘురామిరెడ్డి 35 మంది విద్యార్థులకు కంటి అద్దాలు గురువారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ అంధత్వ నివారణలో భాగంగా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు అద్దాలు అందిస్తున్నట్లు తెలిపారు. కంటి ఆరోగ్యం పట్ల విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప, జ్యోతి పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కానపల్లె గ్రామంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు పెద్దమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గుమ్మళ్ల లత, గుమ్మళ్ల ఉమా మహేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు గోపూజ, యాగశాల ప్రదక్షణ, శనివారం వాస్తు, శాంతి హోమం, ఆదివారం కైప సురేష్ శర్మ ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట జరుగుతాయని వారు వివరించారు. మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్జీవో కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

బి.కోడూరు : మండలంలోని కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీత్ కుమార్‌రాజు, కంటి వైద్యాధికారి హుస్సేనయ్యలు ప్రారంభించారు. కేజీబీవీ పాఠశాలలో 24 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. అలాగే ఐత్రంపేట, బి.కోడూరు, గోవిందాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, సగిలేరు గురుకుల పాఠశాలలో మొత్తం 80 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియదర్శిని, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేరళలో రూ.23వేలు.. రాష్ట్రంలో రూ.7వేలే!

ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చెల్లించే స్టైఫండ్ తమ ఖర్చులకు సరిపోవడం లేదని విద్యార్థులు గత 18 రోజులుగా సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం కనికరించడం లేదు. రోడ్డెక్కి నిరసనలు తెలిపినా చీమ కుట్టినట్లయినా లేదు. పశు వైద్య విద్యార్థులు గత 18 రోజులుగా ఆందోళన చేస్తున్నా వారి సమస్యను ఆలకించిన పరిస్థితి లేకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- స్టైఫండ్ రూ.26 వేలు ఇవ్వాలని నిరసన
- 18 రోజులుగా పశు వైద్య విద్యార్థుల సమ్మె
- ఇప్పటి వరకూ పట్టించుకోని ప్రభుత్వం



కళాశాల ఆవరణలో సమ్మె చేస్తున్న పశువైద్య విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : తిరుపతి వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలో తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి ప్రాంతాల్లో ప్రభుత్వ పశు వైద్య కళాశాలలు నడుస్తున్నాయి. వీటిలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. 400 మంది ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. 2013 నుంచి స్టైఫండ్‌గా కేవలం రూ.7 వేలు మాత్రమే వారికి చెల్లిస్తూ వస్తున్నారు. నాలుగేళ్ల పశు వైద్య విద్య చదివిన తర్వాత 14 నెలలపాటు ఇంటర్న్‌షిప్ కోర్సు చేయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి ఆరు నెలలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో, మరో ఆరు నెలలు ఇతర రాష్ట్రాల్లో ఇంటర్న్‌షిప్ కోర్సు పూర్తి చేయాలి. ఈ సమయంలోనూ ప్రభుత్వం నెలకు కేవలం రూ.7 వేలు చెల్లిస్తోంది. దీంతో ఈ మొత్తం ఏమాత్రం చాలడం లేదని విద్యార్థులు ఇటీవల రోడ్డెక్కి నిరసనలకు దిగారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఇంటర్న్‌షిప్ చేయాలంటే ప్రభుత్వం ఇచ్చే రూ.7 వేలు ఏ మాత్రం సరిపోకపోవడంతో తాము ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు.

స్టైఫండ్ పెంచాలంటూ 18 రోజులుగా సమ్మె

ఈ నెల 3వతేదీ నుంచి రాష్ట్రంలోని నాలుగు పశు వైద్య కళాశాలల విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని కోరుతూ సమ్మె చేపట్టారు. గురువారానికి ఈ సమ్మె 18వ రోజుకు చేరుకుంది. కర్ణాటక, రాజస్థాన్, కేరళ రాష్ట్రాల్లో రూ.23 వేలు, బీహార్‌లో రూ.24 వేలు, ఒడిషాలో రూ.22 వేలు, ఉత్తర ప్రదేశ్‌లో రూ.23,500, తమిళనాడు, హరియాణా, పశ్చిమబెంగల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో పశు వైద్య విద్యార్థులకు రూ.25 వేలు స్టైఫండ్‌గా ఇస్తుంటే.. ఇక్కడ మాత్రం రూ.7వేలు ఇవ్వడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎంత మందిని కలిసినా ఫలితం శూన్యం

స్టైఫండ్ పెంచాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలను కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రతి ఒక్కరూ చూస్తాం, చేస్తాం అంటూ కాలయాపన చేశారేగానీ స్పష్టమైన హామీ ఇవ్వలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారు.

స్టైఫండ్ పెంచే వరకూ ఆందోళన



పశు వైద్య విద్యార్థులకు ప్రభుత్వం స్టైఫండ్ రూ.26వేలకు పెంచే వరకు ఆందోళన విరమించేది లేదు. ఎన్ని రోజులైనా దీక్షలు చేపడతాం

– శివ తరుణ్, ఇంటర్న్‌షిప్ విద్యార్థి

ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది



18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో రూ.20 వేలకు పైగా స్టైఫండ్ ఇస్తుంటే మన రాష్ట్రంలో రూ.7 వేలు ఇవ్వడం న్యాయంకాదు.

– రాహుల్, ఇంటర్న్‌షిప్ విద్యార్థి

చార్జీలకు కూడా సరిపోవు



ప్రభుత్వం ఇచ్చే స్టైఫండ్ చార్జీలకు కూడా సరిపోదు. 2013 లో చార్జీలు, ఇప్పటి చార్జీలు, ఖర్చులు ఎంత మార్పు ఉందో ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు తెలియదా?

– పూజిత, ఇంటర్న్‌షిప్ విద్యార్థి

ఎంబీబీఎస్‌తో సమానంగా ఇవ్వాలి



ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా పశు వైద్య విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలి. పాలకులు వివక్ష చూపుతున్నారు. మొత్తం సరిపోక తల్లిదండ్రులపై ఆధారపడుతున్నాం.

– నజీనీన్, ఇంటర్న్‌షిప్ విద్యార్థి

నిద్రమత్తులో వాహనాలు నడపకూడదు

అట్లూరు : డ్రైవర్లు నిద్రమత్తులో వాహనాలు నడపడం ప్రమాద కరమని అట్లూరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. స్టాప్ అండ్ వాష్‌లో భాగంగా బుధవారం రాత్రి పీపీ కుంట చెక్ పోస్టు దగ్గర వాహనాలను ఆపి డ్రైవర్లకు నీటితో ముఖం వాష్ చేయించి అనంతరం డ్రైవర్లతో రాత్రివేళ వాహనాలు నడుపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

ఖాజీపేట : ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు క్రమశిక్షణ, అంకితభావం ఎంతో ముఖ్యమని, వాటిని అలవర్చుకున్నప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ ఈదురుబాషా అన్నారు. ఖాజీపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని సూచించారు. విజయం సాధించాలంటే కృషి పట్టుదలతోపాటు చక్కటి ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. జీవితంలో విజయం సాధించడానికి కావాల్సిన ఐదు సూత్రలు జ్ఞానం, సృజనాత్మకత, నెట్‌వర్కింగ్, బాధ్యత, విలువలతో కూడిన బంధాలపై క్లుప్తంగా తెలిపారు. అలాగే పోక్సో చట్టం, పిల్లల భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాల గురించి వివరించారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం తగదు



మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రొద్దుటూరు రూరల్ : గోపవరం పంచాయతీలో అంగన్‌వాడీ వర్కర్లపై టీడీపీ నాయకుల దౌర్జన్యం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో గురువారం వారు మాట్లాడుతూ గోపవరం పంచాయతీలో అంగన్‌వాడీ వర్కర్లను రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు వేధిస్తున్నారన్నారు. ఆరు నెలల నుంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, 20 ఏళ్ల కిందట ప్రభుత్వం ఎంపిక చేస్తే ప్రస్తుతం టీడీపీ నాయకులు తమ వర్గానికి చెందిన వారిని వర్కర్లుగా చేర్చుకోవడానికి ఒత్తిడి చేయడం తగదన్నారు. టీడీపీ నాయకుల మాటలు విని ప్రభుత్వ అధికారులు ఆలోచించకుండా అంగన్‌వాడీ వర్కర్లను ఒత్తిడికి గురిచేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు.మీ సమావేశంలో ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న ఎంఈఓ, కోర్సు డైరెక్టర్ ప్రేమ్‌సాగర్

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి 120 రోజుల అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు గురువారం భాషా పరిజ్ఞానంపై ఎంఈఓ, కోర్సు డైరెక్టర్ పి.జే.ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు రెండు రోజుల నుండి వివిధ రకాల అభ్యాసన పద్ధతులను ఉపయోగించి డీఆర్‌పీల ద్వారా శిక్షణ కార్యక్రమం అందిస్తున్నామన్నారు. మూడవ రోజు భాషా పరిజ్ఞానంపై డీఆర్‌పీలు ఎస్.శివారెడ్డి, కృష్ణారెడ్డి, భూతపాటిప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి అందరూ కలిసి ఆటపాటలతో నృత్య రూపంలో కార్యకర్తలను సంతోషపరిచారు. అనంతరం డీఆర్‌పీ శివారెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాల విద్యార్థులకు ఎలా భాషాపరమైన విద్యను అందించాలి, అందులో గల సూచనలను, పద్ధతులను వివిధ రూపాల్లో కథలు, పాత్ర అభినయం, సంభాషణలు, చిత్రాలను చూసి అనుకరించుట లాంటి విషయాల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను వ్యతిరేకించండి



అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రజల ఆశలను అడియాశలు చేసిన ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను ప్రతిఒక్కరు వ్యతిరేకించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు చంద్రమోహన్‌రాజులు తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేద్కర్ సర్కిల్‌లో జాతీయ వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ వంటి వాటికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపించిందన్నారు. అలాగే పేదల సంక్షేమానికి కేటాయింపుల్లో కూడా తీవ్రంగా కోత విధించారని, ఉద్యోగ, కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనలోనూ తక్కువ ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు మేలు జరగని ఇటువంటి బడ్జెట్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. తొలుత నాలుగు రోడ్ల కూడలి నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు పాల్గొన్నారు.

అట్లూరు : కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ అణగారిన ప్రజలకు వ్యతిరేకంగా ఉందని, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్‌బాషా, సీపీఎం మండల కార్యదర్శి ఇ.రమణలు తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం అట్లూరు క్రాస్‌రోడ్డులో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నల్లరిబ్బన్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దితరులు పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని ధర్నా

పోరుమామిళ్ల : వెలుగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించి పూర్తి చేసి పోరుమామిళ్ల, కలసపాడు రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి కోరారు. గురువారం పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు నుండి రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేసి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 1996లో చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో వెలుగొండకు శంఖుస్థాపన చేసి 4 సార్లు సీయంగా ఉన్నా, 30 ఏండ్లు అయినా ఇంతవరకు ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. లోకేష్ కూడా పాదయాత్రలో హామీ ఇచ్చారని అన్నారు. 24న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ ప్రవేశ పెట్టబోతున్నాయని, ఈ బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు కేటాయించాలని ఆయన కోరారు. పట్టిసీమ 2016లో మొదలు పెట్టి 2017లో పూర్తి చేశామని చంద్రబాబు వెలిగొండ గురించి అడిగితే మీకు జీఓ కావాలా? నీళ్లు కావాలా?అని నీళ్లు, జీఓ రెండూ ఇవ్వలేదన్నారు. కృష్ణా నదిలో మిగిలిన నీళ్లను నికర జలాలుగా మలిచి వెలుగొండకు అందించడంలో విఫలమయ్యారని అన్నారు. ధర్నా అనంతరం తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. దస్తగిరిరెడ్డి, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

మొల్ల ఈ ప్రాంత వాసి కావడం గర్వంగా ఉంది



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సాహితీ పీఠం సభ్యులు

గోపవరం : కవయిత్రి మొల్లమాంబ ఈ ప్రాంత వాసి కావడం తమకెంతో గర్వంగా ఉందని ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్, మొల్ల రామాయణ పరిమళ వ్యాఖ్య రచయిత్రి ఆచార్య కోలవెన్నుమలయవాసిని, ప్రొఫెసర్ కె.పాండురంగ విఠలమూర్తిలు అన్నారు. గురువారం మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావుతో కలిసి మొల్ల జన్మస్థలి గోపవరం గ్రామాన్ని, ఆమె నివసించిన శిథిల గృహాన్ని తిలకించారు. అనంతరం గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మొల్ల జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతరం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు మొల్ల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మనోజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రుణం కోసం.. రణం



మున్సిపల్ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద గుమికూడిన దరఖాస్తుదారులు

బద్వేలు అర్బన్ : బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించేందుకు గాను గురువారం మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన ఇంటర్వ్యూల ప్రక్రియ రణరంగంగా మారింది. అధికారుల్లో ముందుచూపు కొరవడటంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

కొరవడిన ముందుచూపు : మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డులకు గాను 2024–25 ఏడాదికి సంబంధించి బీసీలకు రాయితీ రుణాలు ఇవ్వాలన్న లక్ష్యంతో 44 యూనిట్లు మంజూరు చేశారు. ఆయా వార్డుల నుండి దాదాపు 1804 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1555 దరఖాస్తులు అప్రూవల్ చేయగా దరఖాస్తుల్లో పూర్తి వివరాలు పొందుపరచని 247 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. అసంపూర్తిగా ఉన్న రెండు దరఖాస్తులను తిరస్కరించారు. అప్రూవల్ పొందిన 1555 మంది దరఖాస్తుదారులకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను దృష్టిలో ఉంచుకోకుండా ఇంటర్వ్యూలకు ఒకే రోజు కేటాయించడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అరగంటసేపు సజావుగా సాగిన ఇంటర్వ్యూల ప్రక్రియ ఆ తర్వాత గందరగోళంగా మారింది. అభ్యర్థులు ఇచ్చిన టోకెన్ల ఆధారంగా కాకుండా ఇష్టానుసారంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలోకి చొచ్చుకుని వెళ్ళేందుకు ప్రయత్నించడంతో తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. ఇదే సమయంలో కూటమి పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకులు తమ ఇష్టానుసారంగా తమకు అనుకూలంగా ఉన్న దరఖాస్తుదారులను కార్యాలయంలోకి తీసుకెళుతుండటంతో సామాన్య దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది దరఖాస్తుదారులను నిలువరించేందుకు ఎంత ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యపడలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

24 గంటల్లో మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

బి.కోడూరు : మండలంలోని కాసానగరం గ్రామానికి చెందిన ముత్యాలగురప్ప తన భార్య సుశీల, ముగ్గురు పిల్లలు తప్పిపోయారని బి.కోడూరు పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ కె.సి.రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి మొబైల్ ఆధారంగా బెంగుళూరులో ఉన్నట్లు తెలుసుకుని ఆమెను ప్రత్యేక బృందం ద్వారా తీసుకువచ్చి భార్య, పిల్లలను గురువారం సాయంత్రం గురప్పకు అప్పగించారు. పోలీసు సిబ్బందిని బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్ అభినందించారు.

చివరి ఆయకట్టు వరకు నీరివ్వాలి

ఖాజీపేట: కేసీకెనాల్ రెండవ పంటకు మార్చి నెల చివరి వరకూ నీరు ఇవ్వాలని ఏపీఎస్‌ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కేసీ కెనాల్ అధికారులను కోరారు. గురువారం కేసీ కెనాల్ ఒకటో నంబర్ కాలువను ఆయన పరిశీలించారు. అనంతరం రెడ్యం మాట్లాడుతూ దుంపలగట్టుతోపాటు చెమన్నముక్కపల్లె, చెమ్ముళ్లపల్లె, కొత్తపేట వరకూ చుక్క నీరు రాలేదని అన్నారు. నీరు రాక పోతే పంటలు ఎండిపోతాయని తెలిపారు. ప్రస్తుతం రాజోలు వద్ద 200 క్యూసెక్కుల నీరు ఉందని, 600 క్యూసెక్కుల నీరు తగ్గకుండా ఉండేలా అధికారులు ప్రయత్నించాలని సూచించారు.

హెచ్‌ఐవీ అంటు వ్యాధి కాదు

చాపాడు : హెచ్‌ఐవీ/ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, రక్షణ లేని లైంగిక సుఖ వ్యాధుల ద్వారా వ్యాపిస్తుందని దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కావ్య మాధురి పేర్కొన్నారు. మండలంలోని అనంతపురం గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ ఆదేశాల మేరకూ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధి గ్రస్తులు టీబీ వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రాఘవయ్య, దర్బార్ వల్లీ, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు : నేషనల్ అప్రెంటిషిప్ ట్రైనింగ్ స్కీం(ఎన్‌ఏటీఎస్) ఆధ్వర్యంలో ఇచ్చే శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని మెప్మా సీఓ పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ రెగ్యులర్‌గా పూర్తిచేసిన స్వయం సహాయక సంఘాలలోని సభ్యు లు, వారి కుటుంబ సభ్యులు ఈ శిక్షణకు అర్హులని ఆయన పేర్కొన్నారు. 2020–21 నుండి 2024–25 సంవత్సరాల మధ్య డిగ్రీ కంప్లీట్ చేసి ఉండాలని, స్టైఫండ్ ఇస్తారని తెలిపారు.





